క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



పమిడిముక్కల: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని పమిడిముక్కల సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం సీఐ కిషోర్ బాబు కౌన్సెలింగ్ నిర్వహించారు. జీవనోపాధి కోసం వారు చేస్తున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సమయంలో ప్రజా శాంతికి భంగం కలిగే విధంగా రౌడీషీటర్లు ప్రవర్తిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా, అల్లర్లలో పాల్గొన్నా జైలుకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీనివాస్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే ఆత్మ సంతృప్తి



పామర్రు: ఉద్యోగులు అంకితభావంతో పని చేస్తే ప్రజలు, తోటి ఉద్యోగుల మన్నలతో పాటు ఆత్మ సంతృప్తి కలుగుతుందని పామర్రు మానవతా రీజియన్ చైర్మన్ పీఎంఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. పామర్రు మానవతా జీవిత కాల సభ్యులు అల్లాడ సోమశేఖర్‌రావు ఆర్టీసీలో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆదివారం సత్కార సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమశేఖర్‌రావు చేసిన సేవలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం సోమశేఖర్, సీత దంపతులను మానవతా ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో మానవతా కార్యదర్శి పామర్తి వెంకట నారాయణ, కన్వీనర్ త్రివిక్రమరావు, తిరుమలశెట్టి శ్రీనివాస్, డైరెక్టర్లు రామారావు, తుంగల వేణు, కొల్లా శ్రీనివాసరావు, మండపాక సుబ్బారావు పాల్గొన్నారు.

కొండలమ్మకు మొక్కుల సమర్పణ

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలో భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఉదయానికే ఆలయానికి చేరుకుకోవడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారి పుట్టలో పాలు పోసేందుకు, పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసేందుకు అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చింది. స్వామిని దర్శించుకున్న అనంతరం నాగ బంధాల వద్ద పూజలు చేశారు. అదేవిధంగా గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షించారు.

విద్యార్థులకు నీతికథల బోధన

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఆదివారం నీతికథలు బోధించారు. రిటైర్డ్ లైబ్రేరియన్ అవిర్నేని వెంకటేశ్వరరావు ఈ కథలను బోధించారు. అదే విధంగా అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు పాటలు పాడి వినిపించడంతో పాటు మహాభారతంలో శకుని పాత్ర గురించి వివరించారు. అనంతరం లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.

ప్రభుత్వ వసతి గృహాలు.. సౌకర్యాల నిలయాలు

- ఈ నెల 12 నుంచి హాస్టల్ సేవలు పునఃప్రారంభం
- 3వ తరగతి నుంచి కళాశాల వరకు ఉచిత విద్య
- బ్యాంకు ఖాతాలకు కాస్మొటిక్ చార్జీలు



హాస్టల్లో భోజనాలు చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

కైకలూరు: సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వ వసతి గృహాల్లో ప్రవేశాలకు బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 3వ తరగతి నుంచి కళాశాల విద్య వరకు రాష్ట్ర ప్రభుత్వం బాలురు, బాలికలకు వేర్వేరుగా వసతి గృహాలు ఏర్పాటు చేసి సకల సౌకర్యాలు కల్పిస్తోంది. ఈ ఏడాది విద్యా సంవత్సరానికి గాను ఈ నెల 12వ తేదీ నుంచి వసతి గృహాలు తెరవనున్నారు. ఈ నేపథ్యంలో కైకలూరు నియోజకవర్గంలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో సేవలను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంటు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.వెంకటరత్తమ్మ కోరారు.

వసతి గృహాల్లో లభించే సేవలు ఇవి..

- విద్యార్థులకు ఉచిత దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు, ట్రంక్ పెట్టెలు సరఫరా.
- 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు నెలకు బాలురకు రూ.155, బాలికలకు రూ.160తో పాటు కళాశాల విద్యార్థులకు సైతం కాస్మొటిక్ చార్జీలు ఆయా విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు జమ.
- ప్రతి నెలా వైద్యులతో విద్యార్థులకు వైద్య పరీక్షలు.
- కళాశాల విద్యార్థులకు అందుబాటులో కంప్యూటర్లు, ఇంటర్‌నెట్
- వసతిగృహ విద్యార్థులకు సైతం వసతి దీవెన, అమ్మఒడి వర్తింపు.

భోజన సౌకర్యాలు..

- ఉదయం పాలు, ఇడ్లీ, పూరి, పులిహోర, జీరా రైస్, పొంగలి, చిక్కి
- వారానికి ఆరు సార్లు గుడ్లు, ఏడు పర్యాయాలు అరటి పండ్లు
- సాయంత్రం స్నాక్స్‌గా శనగలు, బఠాణీలు, మురమురాలు, అలసందలు, సేమ్యా, పాయసం, రాగి లడ్డు.
- వారానికి మూడు పర్యాయాలు చికెన్ (ఆదివారం చికెన్ బిర్యానీ).
- సాంబారు, క్యారెట్ కూర, భోజనం.

ప్రవేశాలకు కావాల్సినవి..

సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో ప్రవేశాలకు విద్యార్థి తల్లిదండ్రుల ఆధార్, రేషన్ కార్డు, విద్యార్థి టీసీ, బ్యాంకు ఖాతాల జిరాక్సులు తీసుకురావాలి. వీటితో పాటు విద్యార్థి పాస్‌పోర్టు సైజు ఫొటోలు–2 అందించాలి. ఎస్సీలు కాకుండా ఇతర కులాలకు చెందిన వారు కుల ధ్రువీకరణ పత్రం అందించాలి.

కైకలూరు నియోజకవర్గంలో హాస్టళ్ల వివరాలు

- ప్రభుత్వ బాలికల వసతి గృహం, కైకలూరు, హెచ్‌డబ్ల్యూఓ, ఎస్.నాగమణి, సెల్ : 99493 91324
- ప్రభుత్వ బాలికల వసతిగృహం, మండవల్లి, హెచ్‌డబ్ల్యూఓ, కె.అనిత, సెల్: 76900 04660
- ప్రభుత్వ బాలికల వసతి గృహం, కొరుకొల్లు, హెచ్‌డబ్ల్యూఓ, కె.నాగమణి, సెల్: 99638 59406
- ప్రభుత్వ బాలికల వసతి గృహం, ముదినేపల్లి, హెచ్‌డబ్ల్యూఓ, కె.అనిత, సెల్: 76900 04660
- ప్రభుత్వ బాలుర వసతి గృహం, కలిదిండి, హెచ్‌డబ్ల్యూఓ, పి.శివ, సెల్: 98666 18346
- ప్రభుత్వ బాలుర వసతి గృహం, ముదినేపల్లి, హెచ్‌డబ్ల్యూఓ, ఆర్‌వీఏ స్వామి, సెల్: 98498 14238

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



అభయాంజనేయ స్వామి కల్యాణం

గుడివాడ టౌన్: స్థానిక వాసవిచౌక్ సెంటర్‌లోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక కల్యాణ మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామికి అభిషేకాలు, సాయంత్రం స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య జరిగిన ఈ కల్యాణ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కల్యాణ మహోత్సవాలు సోమవారం కూడా కొనసాగుతాయని భక్తులు పాల్గొని మహోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాలకవర్గం గౌరవాధ్యక్షుడు బొగ్గారపు తిరుపతయ్య, అధ్యక్షుడు పోకూరి మోహన్‌రావు, ఉపాధ్యక్షులు శేగు వెంకట రామారావు, శేగు దిలీప్‌కుమార్, కార్యదర్శి తిరివీధి శ్రీరాములు, కోశాధికారి పి.వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి దేవస్థానంలో..

గుడివాడ టౌన్: స్థానిక పెద్దవీధిలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామి వారి కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా కల్యాణం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కల్యాణం అనంతరం భారీ అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో అర్చకులు ఎం. శ్రీకృష్ణకుమార్ శర్మ, ఎ.సమీర్ కుమార్ శర్మ, జె.బాలకృష్ణ శర్మ, సత్య వరప్రసాద్, బి.శేషాచలశర్మ, ఆలయ నిర్వాహకులు పి.పద్మావతి, జి. ప్రియ అనురాధ, జి. సత్యనారాయణ, ఆర్. శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజలకు సంక్షేమం అందించే ప్రభుత్వం రావాలి



మాట్లాడుతున్న సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ రాజు

పామర్రు: రాష్ట్రంలోని ప్రజలకు సంక్షేమం అందించే ప్రభుత్వం రావాలని ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ రాజు కొల్లాబత్తుల అన్నారు. స్థానిక చాట్లవానిపురంలోని విజన్ లైఫ్ సెంటర్‌లో నియోజకవర్గ స్థాయి పాస్టర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలను అందించే ప్రభుత్వాన్ని భగవంతుడు మనకు ప్రసాదించాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ప్రభుత్వమే రేపు గెలవ బోతోందన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు టీ షాలేంరాజు, ఎం.చంటిబాబు, శామ్యూల్, బీవీ సాగర్, ఆదాము, బి.సాల్మన్‌రాజు, ఆర్ సాల్మన్ రాజు పాల్గొన్నారు.

మధుర మామిడి ఆరోగ్య ప్రదాయిని



మామిడి పండ్లు

గుడ్లవల్లేరు: వేసవి సీజన్ వచ్చిందంటే ఫలాల్లో రారాజైన మధురమైన మామిడిపండును ఇష్టపడని ఫల ప్రియులు ఉండరు. ఈ ఫలాన్ని తినడం వలన ఆరోగ్యానికి మంచిదే అని కూడా వైద్యులు చెబుతున్నారు. బంగిన పల్లి, రసాల పేర్లు చెబితేనే నోరు ఊరుతూ ఉంటుంది. ఏప్రిల్ నుంచి జూలై వరకు మామిడి విక్రయాలు జరుగుతుంటాయి. ప్రపంచంలోనే మామిడి సాగు మన దేశానిదే సింహ భాగం. జిల్లాలోనే నూజివీడు మామిడి అయితే ప్రపంచ ప్రసిద్ధి. ఇటీవల మోస్తరుగా కురిసిన వర్షాల కారణంగా కొంత మేరకు మామిడి పంట రాలింది. దీంతో పెద్ద సైజు మామిడి అయితే డజను రూ.400, చిన్న సైజు అయితే రూ.250 చొప్పున వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఇంకా రెండు నెలల పాటు వ్యాపారం బాగా జరిగే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. మూడు నెలల పాటు నిర్వహించే ఈ వ్యాపారంతో చిరు వ్యాపారులు జీవనం పొందుతున్నారు.

మామిడి ఆరోగ్యానికి మంచిదే



సీజనల్‌గా మార్కెట్లోకి వచ్చే మామిడి పండు తింటే ఆరోగ్యానికి మంచిదే. సహజంగా పండిన కాయలను తింటేనే ఉత్తమం. మామిడిలో ఎన్నో పోషక విలువలు శరీరానికి మేలు చేస్తాయి. ఈ ఫలంలో కార్బన్ కణాలను అరికట్టే గొప్ప సద్గుణం ఉంది. దీనిలో ఉండే పాలీఫినోల్ ఇందుకు సహకరిస్తోంది. 15 శాతం చక్కెర, ఒక శాతం ఏ, బీ, సీ విటమిన్లు ఉంటాయి. పిండి పదార్థాలు – 17గ్రాములు, మాంసకృత్తులు – 51 గ్రాములు, థయామిన్ 0.58 గ్రాములు, సియాసిన్ – 0.584 గ్రాములు ఉంటాయి. ముఖ్యంగా పచ్చి కాయలను కాల్షియం కార్బైడ్ రసాయనంతో పండించిన మామిడి పండ్లను తింటే ఆరోగ్యానికి మంచిది కాదు. షుగర్ వ్యాధి గ్రస్తులు ఎంత తక్కువగా మామిడి ఫలాలను తింటే అంత మంచిది.

– డాక్టర్ సీహెచ్. సుగుణావతి,
వైద్యురాలు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, గుడివాడ

శాంతిభద్రతలకు సహకరించాలి



ముదినేపల్లి రూరల్: సార్వత్రిక ఎన్నికల ఫలితాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలు కాపాడేందుకు ప్రజలు సహకరించాలని ఎస్సై డి.వెంకటకుమార్ అన్నారు. మండలంలోని వడాలిలో ఇందుకు సంబంధించి పోలీస్ పికెట్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫలితాల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గుర్తించిన సమస్యాత్మక గ్రామాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

తోట్లవల్లూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని భద్రిరాజుపాలెంలో జరిగింది. గ్రామానికి చెందిన కొల్లి దుర్గ(55) గత నెల 16వ తేదీన తన కుమారుడు సతీశ్ రెడ్డి టీవీఎస్ మోపెడ్‌పై కృష్ణా కరకట్టపై ప్రయాణిస్తూ పాములలంక టవర్ సమీపంలో కళ్లు తిరిగి పడిపోయి గాయపడింది. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. భర్త భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.విశ్వనాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం



కై కలూరు: ఎగ్జిట్ పోల్స్ సాకుగా ఎవరెన్ని అసత్య ప్రచారాలు చేసినా కౌంటింగ్ రోజున కైకలూరు నియోజకవర్గం మరో పర్యాయం వైఎస్సార్ సీపీ ఖాతాలో చేరుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ధీమా వ్యక్తం చేశారు. ఏలూరు రోడ్‌లోని పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో డీఎన్నార్ ఆదివారం సమీక్షించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ మరోసారి నియోజకవర్గంలో డీఎన్నార్‌దే విజయం అని, ఆయనకు పూలదండలు వేసి అభినందించారు. ఎంపీపీలు అడవి కృష్ణ, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, నాయకులు శ్రీదేవి, నాగరాజు, జహీర్, గోపాలకృష్ణ, బాబీ, అశోక్, వెంకటరమణ, బుజ్జి, వెంకటేశ్వరరావు, తంబిస్వామి, బాలమ్మ పాల్గొన్నారు.

కైకలూరు ఎస్టీ కాలనీలో కార్డెన్ సెర్చ్



కైకలూరు ఎస్టీ కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న సీఐ రఘు

కైకలూరు: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కైకలూరు ఎస్టీ కాలనీ, కాల్వ గట్టు ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ ఆదివారం నిర్వహించామని కైకలూరు టౌన్ సీఐ ఆకుల రఘు చెప్పారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, రికార్డులు లేని వాహనాలు, పత్రాలను పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ మంగళవారం నిర్వహించే కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి గ్రామంలోనూ పోలీసు పికెట్లను ఏర్పాటు చేశామన్నారు. ఎగ్జిట్ పోల్‌ను పురస్కరించుకుని ఎవరైనా వివాదాలకు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కైకలూరు టౌన్ ఎస్ఐ ఎంఆర్‌కే.రాజు పాల్గొన్నారు.

హద్దు మీరితే చర్యలు తప్పవు

కైకలూరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున పార్టీల అభిమానులు, ప్రజలు హద్దు మీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్సై టి.రామకృష్ణ హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామమైన భుజబలపట్నంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేసి విజుబుల్ పోలీసింగ్‌ను ఆదివారం నిర్వహించారు.

పుస్తక పఠనంపై అవగాహన అవసరం



పామర్రులో డ్రెస్ కాంపిటీషన్‌లో పాల్గొన్న విద్యార్థులు



కలిదిండి గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

జమీగొల్వేపల్లి(పామర్రు): పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన అవసరమని విశ్రాంత ఉద్యోగులు సీహెచ్ కృష్ణమోహన్, చంద్రశేఖర్ అజాద్ పేర్కొన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా పుస్తక పఠనం ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని, ప్రతి విద్యార్థి చిన్న నాటి నుంచి గ్రంథాలయానికి వెళ్లడాన్ని ఒక అలవాటుగా చేసుకోవాలన్నారు. తద్వారా బాల సాహిత్యం, నీతి కథలు, పంచతంత్రం, శతక పద్యాలు, విజ్ఞాన విషయాలు వంటి పుస్తకాలను చదవడం వలన పుస్తక పఠనంపై అభిరుచి, ఆసక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్, ఉపాధ్యాయులు దీని వంశీ కృష్ణ పాల్గొన్నారు.

పామర్రులో ..

స్థానిక ద్వితీయశ్రేణి శాఖ గ్రంథాలయంల విద్యార్థులకు ఆదివారం ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ ఏర్పాటు చేశామని గ్రంథాలయాధికారి ఎం.ఝాన్సీరాణి అన్నారు. అనంతరం విద్యార్థులతో న్యూస్ పేపర్ చదవించినట్లు పేర్కొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో ఆదివారం పుస్తక పఠనం, పజిల్స్ నేర్పించినట్లు గ్రంథాలయాధికారి షేక్ పర్వీన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పజిల్స్ నేర్చుకోవడం వల్ల పిల్లలు గణితంలో పట్టు సాధిస్తారన్నారు. ఖాళీగా ఉన్న సమయంలో స్కూల్ పుస్తకాలతో పాటు పజిల్స్ వంటి వాటిని కూడా చేస్తూ ఉండటం వలన మెదడుకు పదును దొరుకుందని పర్వీన తెలిపారు.

కలిదిండిలో..

కలిదిండి: పుస్తకాలు చదవడం అలవర్చుకున్న వారికి అవి చిరకాలం స్నేహితునిగా వెంట వస్తాయని, అందువలన విజ్ఞానం పెరుగుతుందని శాఖా గ్రంథాలయాంధికారి జే రమేష్‌బాబు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో కలిదిండి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తూ రిటైర్డ్ ఎంప్లాయ్ కళా వెంకట సత్యనారాయణమూర్తి ఆదివారం విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియోగం వల్ల అనేక మానసిక, శారీరక రుగ్మతలను ఎదుర్కోవడం జరుగుతుందన్నారు. పుస్తక పఠనం వలన వ్యక్తిత్వ వికాసం, శారీరక, మానసిక పరిపక్వత ఎదుగుదలలో పుస్తక పఠనం ప్రముఖ పాత్ర పోషిస్తుందని తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



మేడూరులో గురువులతో 1993-94 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

పమిడిముక్కల: మేడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఘనంగా జరిగింది. 1993–94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 30 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని చిన్ననాటి సంఘటనలు గుర్తుచేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. 1993–94 బ్యాచ్ తరపున మూడో తరగతి గదుల్లో ఆరు సీలింగ్ ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

గుడివాడరూరల్: గుడివాడ తాలూకా సర్కిల్ పరిధిలోని గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని గుడివాడ తాలూకా సీఐ కె.ఏసు బాబు హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం స్థానిక సీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 4వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున ఎటువంటి గొడవలు, ఘర్షణలు జరగకుండా ముందస్తుగానే జిల్లా ఎస్పీ, గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. దీంతో సెక్షన్–30 కూడా అమలు చేస్తున్నామని, ఎవరైనా పోలీసుల ఆదేశాలు పాటించకుండా గొడవలు, ఘర్షణలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా కౌంటింగ్ ముగిసిన అనంతరం ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు, టపాసులు కాల్చడానికి అనుమతులు లేవని తెలిపారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ఖాళీ సీసాల్లో పెట్రోలు, డీజిల్ ఎవరికి కొట్టవద్దని పెట్రోల్ బంకుల యజమానులకు సూచించారు. రాజకీయ పార్టీల నాయకులతో పాటు ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు

కృత్తివెన్ను: హనుమజ్జయంతి ఉత్సవాలు మండల వ్యాప్తంగా రెండో రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాలు సందర్భంగా గాంధీనగరం గ్రామంలోని అభయ ఆంజనేయస్వామివారి దేవాలయంలో ఆదివారం స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తమలపాకులార్చన, సింధూరార్చనలు జరిగాయి. మరో మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు వివరించారు. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుంటున్నారు. నీలిపూడి, సీతనపల్లి, ఒంటిళ్ల గ్రామాలలోనూ ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

ఏనుగులకోడులో గుర్రపుడెక్క తొలగించాలి



వల్లూరుపాలెం వద్ద ఏనుగులకోడు డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క

తోట్లవల్లూరు: ఏనుగులకోడు డ్రెయిన్‌లో గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని రొయ్యూరు నుంచి పెనమకూరు మధ్యలో ఏనుగులకోడు డ్రెయిన్ ప్రవహిస్తోంది. వేలాది ఎకరాలను నీటి ముంపు బారి నుంచి కాపాడే ఈ డ్రెయిన్ గుర్రపుడెక్క, తూటుకాడతో అధ్వానంగా మారింది. వర్షాకాలంలో వరిపొలాలు నీటి ముంపునకు గురైనప్పుడు ఈ డ్రెయిన్ ద్వారానే ముంపు నీరు బయటకు వెళ్లాల్సి ఉంటుంది. లేదంటే వందలాది ఎకరాలు ముంపు బారినపడే ప్రమాదం ఉంది. ఖరీఫ్ సీజన్ కూడా సమీపిస్తున్న నేపథ్యంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే ఏనుగులకోడులో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

గుడివాడ టౌన్: పట్టణంతో పాటు పలు ప్రాంతాలకు సాగు, తాగు నీరు అందించే పంట కాల్వలో గుర్రపుడెక్క తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ సీపీ రెడ్డి కోరారు. ఆదివారం ఆయన స్థానిక పెద ఎరికపాడు లోని దొండపాడు కాల్వ వద్ద విలేకరులతో మాట్లాడారు. ప్రధాన పంటకాలువ అయిన ఈ కాలువ ద్వారా మరో 20 కిలోమీటర్లు పైబడి సాగునీరు వెళ్లాల్సి ఉందన్నారు. దీనికి తోడు పట్టణానికి తాగునీటి అవసరాలు తీర్చేందుకు కూడా ఇదే ఉపయోగ పడుతుందన్నారు. ఈ కాలవలో గుర్రపుడెక్క పేరుకుపోవడం వలన నీటి ప్రవాహానికి తీవ్ర ఇబ్బందులు కలుగుతాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుర్రపుడెక్క తొలగించాలని ఆయన కోరారు.